PRGI REGN NO: APTEL/26/A3695

నేటి మినిట్ టు మినిట్

తెలుగు దిన పత్రిక

NETI MINUTE TO MINUTE

TELUGU DAILY

సంపుటి: 01 సంచిక :153 ఎడిషన్ : అనంతపురము మరియు సత్యసాయి జిల్లా, తేది : బుధవారం -18 నవంబర్ 2026, పేజీలు -4 వెల 1/-

VOLUME:01 ISSUE:153 EDITION: ANANTHAPURAMU, SATHYA SAI DIST. DATE: WEDNESDAY 18 NOVEMBER 2026 PAGES: 04 RS:01/

ప్రపంచ సవాళ్లపై ఉమ్మడి పోరు!

- అంతర్జాతీయ చట్టాల గౌరవానికి దేశాల పిలుపు..
సముద్ర భద్రత, వాణిజ్యం, ఆర్థిక సహకారంపై సంయుక్త ప్రకటన



2లో

బంగాళాఖాతంలో మరో తుపాన్ కలకలం!

- తెలుగు రాష్ట్రాలకు వాతావరణ శాఖ హెచ్చరికలు.. భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలుల ముప్పు
- ఈ నెలలోనే మూడో తుపాన్ ముప్పు.. 19 నాటికి తీవ్ర తుపాన్‌గా అక్వాన్


2లో



అక్వాన్ తుపానుపై చంద్రబాబు సమీక్ష

- ఈ నెల 19, 20 తేదీల్లో భారీ వర్షాల హెచ్చరికలు..
ప్రజల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని అధికారులకు ఆదేశం

అమరావతి, నవంబర్ 17(నేటి మినిట్ టు మినిట్): అక్వాన్ తుపాను కదలికలు, తీవ్రత, రాష్ట్రంపై చూపే ప్రభావంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంగళవారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించి, తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఆదేశించారు. మిగతా2లో...

తుపాన్ల దెబ్బకు రూ.7 వేల కోట్ల నష్టం!

● రాష్ట్రానికి తక్షణ ఆర్థిక సాయం అందించండి..
కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు సీఎం చంద్రబాబు విజ్ఞప్తి



న్యూఢిల్లీ,నవంబర్ 17(నేటి మినిట్ టు మినిట్): వరుసగా సంభవించిన రెండు భారీ తుపాన్లతో ఆంధ్రప్రదేశ్ తీవ్రంగా నష్టపోయిందని, రాష్ట్రానికి తక్షణ ఆర్థిక సాయం అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్రాన్ని కోరారు. మంగళవారం ఢిల్లీలో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో ఆయన భేటీ అయ్యారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, తుపాన్ల నష్టం, అభివృద్ధి ప్రణాళికలు, హార్టికల్చర్ హబ్, పూర్వోదయ నిధుల విడుదల తదితర అంశాలపై చర్చించారు. **రూ.7 వేల కోట్లకు పైగా నష్టం** ఇటీవల రాష్ట్రాన్ని తాకిన అర్నబ్, మురసు తుపాన్ల కారణంగా ప్రాథమిక అంచనాల ప్రకారమే రూ.7 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లిందని చంద్రబాబు కేంద్ర మంత్రికి వివరించారు. తుపాను ముప్పును ముందుగానే గుర్తించి ప్రభుత్వం చేపట్టిన చర్యలను వివరించారు. చేతికందే దశలో ఉన్న పంటలు వరద నీటిలో మునిగిపోయాయని మిగతా2లో...

గ్రామ ఎన్నికల అభ్యర్థులకు పోలీసు రక్షణ

● నామినేషన్ల సమయంలో ఆటంకాలు లేకుండా చూడాలి.. భద్రత కోరుతూ వచ్చిన వినతులపై చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశం



2లో

అక్వాన్ తుపానును ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలి

● తీర ప్రాంత జిల్లాలకు పొంచి ఉన్న ముప్పు.. ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పవన్ కల్యాణ్ ఆదేశం



అమరావతి,నవంబర్ 17(నేటి మినిట్ టు మినిట్): అక్వాన్ తుపాను ముప్పు నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను అప్రమత్తం చేశారు. అమరావతిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల అధికారులతో తుపాను ప్రభావంపై సమీక్ష నిర్వహించారు. గత రెండు తుపాన్లతో పోలిస్తే అక్వాన్ తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, మంగళవారం నుంచి తీర ప్రాంత జిల్లాలపై ప్రభావం కనిపించవచ్చని తెలిపారు.వాతావరణ శాఖ అంచనాల ప్రకారం నెల్లూరు నుంచి తుని మధ్య తుపాను తీరం తాకే అవకాశం ఉన్నందున సంబంధిత జిల్లాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని పవన్ కల్యాణ్ సూచించారు. భారీ వర్షాలు, వరదలపై ముందస్తు హెచ్చరికలు జారీ చేసి ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని ఆదేశించారు.ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి మిగతా2లో...

కోటి కుటుంబాలకు బీమా భరోసా!

- ప్రభుత్వ బీమా పథకాలన్నీ ఒకే గొడుగు కిందకు..
19న సిద్ధిపేట సభలో దరఖాస్తు విడుదల


2లో


2లో

కోనసీమలో గ్యాస్ కలకలం.. అదుపులోకి బ్లోఅవుట్

- ఓఎన్‌జీసీ బావి వద్ద ఒక్కసారిగా గ్యాస్ లీకేజీ.. 200 నుంచి 300 కుటుంబాల తరలింపు.. రంగంలోకి దిగిన నిపుణులు

అమరావతి ఓఆర్ఆర్ టెండర్లకు గ్రీన్‌సిగ్నల్

నిలిపివేయాలన్న పిటిషనర్ అభ్యర్థన తిరస్కరణ.. తదుపరి విచారణ ఈ నెల 19న


2లో



ప్రపంచ సవాళ్లపై ఉమ్మడి పోరు!

మనీలా,నవంబర్ 17(నేటి మినిట్ టు మినిట్): ప్రపంచవ్యాప్తంగా మారుతున్న పరిణామాలు, పెరుగుతున్న సవాళ్ల నేపథ్యంలో కలిసి ముందుకు సాగాలని తూర్పు ఆసియా దేశాలు సంకల్పించాయి. మనీలాలో మంగళవారం ముగిసిన తూర్పు ఆసియా శిఖరాగ్ర సదస్సు అనంతరం 'స్థిరమైన భవిష్యత్తు, పునరుద్ధరణ కోసం కలిసి ముందుకు' అనే శీర్షికతో సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. సముద్ర భద్రత, వాణిజ్య ఆంక్షలు, పెరుగుతున్న ధరలు, సరఫరా వ్యవస్థల బలోపేతం వంటి కీలక అంశాలకు ఇందులో ప్రాధాన్యం ఇచ్చాయి.ఆసియాన్ దేశాలతో పాటు భారత్, అమెరికా, చైనా, జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, రష్యా తదితర దేశాలు ఈ సమావేశంలో పాల్గొన్నాయి. 1982లో కుదిరిన ఐక్యరాజ్యసమితి సముద్ర చట్టాల ఒప్పందాన్ని గౌరవించాలని నేతలు స్పష్టం చేశారు. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా సముద్ర వాణిజ్యం, నౌకాయానం, గగనతల ప్రయాణ స్వేచ్ఛను పరిరక్షించాలని పిలుపునిచ్చారు.సముద్ర వనరులు, జీవవైవిధ్యం, పర్యావరణ వ్యవస్థల సంరక్షణతో పాటు సముద్ర కాలుష్యం, వ్యర్థాల నివారణకు పరస్పర సహకారం పెంచుకోవాలని పేర్కొన్నారు. సముద్రగర్భంలోని కేబుళ్లు, పైప్‌లైన్లు, కీలక మౌలిక



సదుపాయాలకు రక్షణ కల్పించాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని సూచించారు. **ధరల నియంత్రణకు వాణిజ్య మార్గాలు** నిత్యావసర వస్తువులు, ఇంధన ధరలు పెరుగుతున్న నేపథ్యంలో సరఫరాలో కొరత ఏర్పడకుండా వాణిజ్య మార్గాలను తెరిచి ఉంచాలని దేశాలు నిర్ణయించాయి. కీలక ఖనిజాలతో సహా సరఫరా వ్యవస్థలు అంతరాయాలను తట్టుకునేలా అభివృద్ధి చేయాలని పేర్కొన్నాయి. వాణిజ్య సమస్యలను చర్చలు, సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించాయి. వాయు, భూ, సముద్ర మార్గాల్లో అనుసంధానాన్ని విస్తరించడంతో పాటు ఇంధన రంగంలో సహకారాన్ని పెంచుకోవాలని పిలుపునిచ్చాయి.డిజిటల్ సాంకేతికత, కృత్రిమ మేధస్సు, శాస్త్రసాంకేతిక పరిశోధనలు, నూతన ఆవిష్కరణల్లో పరస్పర సహకారాన్ని విస్తరించాలని నిర్ణయించాయి. ఆన్‌లైన్ మోసాలు, మనుషుల అక్రమ రవాణా, ఇంటర్నెట్ ద్వారా జరిగే లైంగిక వేధింపులు, దోపిడీ వంటి నేరాలను అరికట్టేందుకు సమన్వయంతో చర్యలు చేపట్టాలని పేర్కొన్నాయి. ముఖ్యంగా పిల్లలు, బలహీన వర్గాల రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశాయి.ఇంధన, ఆహార భద్రత, ఆరోగ్య వ్యవస్థల స్థిరత్వం, విపత్తుల సన్నద్ధత, సహాయక చర్యలు, వలస కార్మికుల రక్షణ వంటి అంశాల్లోనూ సహకారాన్ని బలోపేతం చేయాలని నేతలు నిర్ణయించారు. **శాంతియుత ఇండో-పసిఫిక్ లక్ష్యం: మోదీ** శాంతియుతమైన, సుస్థిరమైన, సంపన్నమైన ఇండో-పసిఫిక్ ప్రాంతం భారత్ ఆకాంక్ష అని ప్రధాని నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. తూర్పు ఆసియా శిఖరాగ్ర సదస్సులో ప్రసంగిస్తూ ప్రాంతీయ, అంతర్జాతీయ సవాళ్ల పరిష్కారంలో చర్చలు, దౌత్యానికి ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. ఆసియా-పసిఫిక్ ప్రాంత భద్రత, రక్షణ అంశాలపై చర్చించేందుకు ఈ సదస్సు కీలక వేదికగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రాంతీయ సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

తుపాన్ల దెబ్బకు రూ.7 వేల కోట్ల నష్టం!

(మొదటి పేజీ తరువాయి)

రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం ఉన్నప్పటికీ రైతులను ఆదుకునేందుకు పట్టిసీమ ద్వారా కొన్ని ప్రాంతాలకు సాగునీరు అందించామని, అయినా వరుస తుపాన్లతో రైతులకు తీవ్ర నష్టం జరిగిందని పేర్కొన్నారు. తీర ప్రాంతాల్లో మౌలిక వసతులు దెబ్బతిన్నాయని, ముఖ్యంగా విద్యుత్ వ్యవస్థకు భారీ నష్టం వాటిల్లిందని వివరించారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రానికి తక్షణ ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.తుపాన్ల నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర బృందాలు రాష్ట్రంలో పర్యటించాయని, త్వరలోనే నివేదికలు సమర్పించనున్నాయని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని కేంద్రం వెంటనే సాయం అందిస్తే బాధితులను ఆదుకోవడంతో పాటు పునరుద్ధరణ పనులను వేగవంతం చేయడానికి వీలవుతుందని చెప్పారు. **ప్రాంతాల వారీగా అభివృద్ధి ప్రణాళికలు** రాష్ట్రంలో విశాఖపట్నం, అమరావతి, తిరుపతి ప్రాంతాలను ప్రత్యేక ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు చంద్రబాబు వివరించారు. రాయలసీమ హార్టికల్చర్ హబ్‌కు ఇప్పటికే నిర్మలా సీతారామన్ శంకుస్థాపన చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ ప్రాజెక్టులో భాగంగా వివిధ స్థాయిల్లో మౌలిక వసతుల అభివృద్ధి చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామీణ రహదారుల అనుసంధానం, సాగునీటి సదుపాయాల మెరుగుదల, సూక్ష్మ సేద్యాన్ని ప్రోత్సహించడం వంటి అంశాలపైనా చర్చించారు. విశాఖలో నిర్వహించిన భాగస్వామ్య సదస్సు, అందులో తీసుకున్న నిర్ణయాలను కూడా కేంద్ర మంత్రికి వివరించారు.

కోటి కుటుంబాలకు బీమా భరోసా!

హైదరాబాద్,నవంబర్ 17(నేటి మినిట్ టు మినిట్): రాష్ట్రంలోని కోటి కుటుంబాలకు ఇందిరమ్మ బీమా పథకాన్ని అమలు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా అమలవుతున్న బీమా పథకాలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని సూచించారు. ఈ పథకం ద్వారా ఉపాధి హామీ కూలీలతో పాటు లక్షలాది మంది పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించనున్నట్లు తెలిపారు.ఇప్పటికే అమలులో ఉన్న వివిధ బీమా పథకాల కింద జీవిత బీమాగా రూ.2 లక్షలు, ప్రమాద బీమాగా రూ.10 లక్షల వరకు అందిస్తున్నట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ నెల 19న సిద్దిపేటలో నిర్వహించనున్న బహిరంగ సభలో ఇందిరమ్మ బీమా పథకాన్ని ప్రారంభించడంతో పాటు దరఖాస్తులను విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నివాసంలో అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం ప్రభుత్వ బీమా పథకాల ద్వారా ప్రయోజనం పొందుతున్న వారిలో ఏ ఒక్కరూ కొత్త పథకం అమలుతో నష్టపోకూడదని అధికారులకు స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి కుటుంబానికి బీమా ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్లు పథకంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని, దరఖాస్తులను గ్రామస్థాయిలో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.**మహిళలందరికీ ఇందిరమ్మ చీరలు** అర్హులైన ప్రతి మహిళకు ఇందిరమ్మ చీర అందించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

చీరలను తక్షణమే అన్ని జిల్లాలకు తరలించాలని సూచించారు. పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇందిరమ్మ బీమా, చీరల పంపిణీపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు.

ఈ సమీక్షలో సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ప్రత్యేక కార్యదర్శి శ్రీధర్, కార్యదర్శి మానిక్‌రాజ్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ఓఎస్డీ వేముల శ్రీనివాసులు పాల్గొన్నారు.

కోనసీమలో గ్యాస్ కలకలం.. అదుపులోకి బ్లోఅవుట్

మామిడికుదురు,నవంబర్ 17(నేటి మినిట్ టు మినిట్): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం గెద్దాడ గ్రామంలో ఓఎన్‌జీసీ బావి వద్ద మంగళవారం తెల్లవారుజామున గ్యాస్ బ్లోఅవుట్ సంభవించింది. జాతీయ రహదారి 216 పక్కన ఉన్న బావిలో మరమ్మతు పనులు (వర్కోవర్) జరుగుతుండగా ఒక్కసారిగా గ్యాస్ భారీగా వెలువడటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు.సమాచారం అందుకున్న అధికారులు తక్షణమే అప్రమత్తమయ్యారు. బావి చుట్టూ 500 మీటర్ల పరిధిలో నివసిస్తున్న సుమారు 200 నుంచి 300 కుటుంబాలను సురక్షిత ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించారు. ముందస్తు జాగ్రత్తగా జాతీయ రహదారి 216పై రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. పరిసర గ్రామాలకు విద్యుత్ సరఫరాను కూడా నిలిపివేశారు.

మధ్యాహ్నానికి అదుపులోకి.. గ్యాస్ లీకేజీ సమాచారం అందుకున్న వెంటనే ఓఎన్‌జీసీ రాజమండ్రి విపత్తు నిర్వహణ బృందం ఘటనా స్థలానికి చేరుకుంది. భద్రతా చర్యలు చేపట్టి, బావి చుట్టూ 500 మీటర్ల పరిధిని దిగ్బంధించింది.

గ్యాస్ వ్యాప్తిని నియంత్రించేందుకు వాటర్ బ్లాంకెట్ ఏర్పాటు చేసింది. ఓఎన్‌జీసీ సాంకేతిక నిపుణులు నిరంతరంగా శ్రమించి మధ్యాహ్నం మూడు గంటల సమయానికి గ్యాస్ బ్లోఅవుట్‌ను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. గ్యాస్ సాంద్రత పరీక్షల్లో సున్నాగా నమోదైనట్లు సంస్థ ప్రకటించింది.**భద్రతా చర్యలపై సమీక్షకు ఆదేశం** ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని, ఓఎన్‌జీసీ ప్రత్యేక సాంకేతిక బృందాలతో సమన్వయం చేసుకుంటూ తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇటీవల ఇలాంటి ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్న నేపథ్యంలో ఓఎన్‌జీసీ చైర్మన్, ఉన్నతాధికారులతో మాట్లాడి భద్రతా చర్యలను సమీక్షించాలని సూచించారు. వరుస గ్యాస్ లీకేజీల నేపథ్యంలో సమగ్ర భద్రతా తనిఖీలు నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా అధికారులను ఆదేశించారు.

అమరావతి ఓఆర్ఆర్ టెండర్లకు గ్రీన్‌సిగ్నల్

- నిలిపివేయాలన్న పిటిషనర్ అభ్యర్థన తిరస్కరణ.. తదుపరి విచారణ ఈ నెల 19న

అమరావతి,నవంబర్ 17(నేటి మినిట్ టు మినిట్): అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) అలైన్‌మెంట్ మార్పును సవాల్ చేస్తూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంలో టెండర్ల ప్రక్రియను నిలిపివేయాలన్న పిటిషనర్ మధ్యంతర అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం నిర్ణయం తీసుకుంది.అలైన్‌మెంట్ నిర్ణయంలో నిబంధనలు పాటించలేదని, సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్), మంత్రిమండలి ఆమోదం లేకుండానే టెండర్లు పిలిచారని పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు. దీనిపై స్పందించిన జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) అలైన్‌మెంట్ నిర్ణయం సాంకేతిక నిపుణుల పరిధిలోని అంశమని కోర్టుకు తెలిపింది.ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం రాతపూర్వక వాదనలు సమర్పించాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను ఈ నెల 19కి వాయిదా వేసింది. కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరుకు చెందిన రైతు కనిగంటి ఆంజనేయ ప్రసాద్ ఈ ఏడాది ఏప్రిల్‌లో పిల్ దాఖలు చేశారు. అమరావతి ఓఆర్ఆర్‌లో విజయవాడ నార్త్ ఈస్ట్, సౌత్ ఈస్ట్ అలైన్‌మెంట్ల మార్పును ఆయన సవాల్ చేశారు.

బంగాళాఖాతంలో మరో తుపాన్ కలకలం!

న్యూఢిల్లీ,నవంబర్ 17(నేటి మినిట్ టు మినిట్):బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం బలపడుతుండటంతో మరో తుపాన్ ముప్పు పొంచి ఉంది. గడిచిన నెల రోజుల వ్యవధిలో ఇప్పటికే అర్నాబ్, మురసు తుపాన్లు రాగా, తాజాగా మూడో తుపాన్ రానుండటం ఆందోళన కలిగిస్తోంది. దీనికి 'అక్వాన్'గా నామకరణం చేశారు. సముద్రంలో మేఘాలు వేగంగా కదులుతున్న నేపథ్యంలో రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలుగు రాష్ట్రాలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేసింది.ఇన్‌సాట్-3డీఎస్, ఇన్‌సాట్-3డీఆర్ ఉపగ్రహ చిత్రాల్లో ఆగ్నేయ బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న నైరుతి బంగాళాఖాతంలో భారీగా మేఘాలు ఏర్పడినట్లు గుర్తించారు. అక్వాన్ తుపాన్ నవంబర్ 19 నాటికి మరింత బలపడి తీవ్ర తుపాన్‌గా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.**20న తీరం దాటే అవకాశం**ఈ నెల 20న నెల్లూరుతుని మధ్య తుపాన్ తీరం దాటే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. తీరం దాటే సమయంలో గంటకు 120 నుంచి 130 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉండగా, గరిష్ఠంగా 145 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీయవచ్చని హెచ్చరించారు. తుపాన్ ప్రభావంతో నవంబర్ 18 నుంచి ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణ పరిస్థితులు మారనున్నాయి. పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్ని చోట్ల ఈదురుగాలులతో పాటు ఆకస్మిక వరదలు సంభవించే ప్రమాదం ఉందని అధికారులు అప్రమత్తం చేశారు. **మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దు** సముద్రం అల్లకల్లోలంగా మారే అవకాశం ఉన్నందున మత్స్యకారులు ఎట్టి పరిస్థితుల్లోనూ వేటకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరించారు. తీరప్రాంత ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

గ్రామ ఎన్నికల అభ్యర్థులకు పోలీసు రక్షణ

అమరావతి,నవంబర్ 17(నేటి మినిట్ టు మినిట్): రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేసే అభ్యర్థులకు తగిన పోలీసు భద్రత కల్పించాలని హైకోర్టు ఆదేశించింది. నామినేషన్లు దాఖలు చేసేందుకు వెళ్లే సమయంలో ఎలాంటి ఆటంకాలు ఎదురుకాకుండా చూడాలని పోలీసులకు స్పష్టం చేసింది. భద్రత కోరుతూ అభ్యర్థులు ఈ-మెయిల్, వాట్సాప్ ద్వారా పంపిన వినతులను పరిగణనలోకి తీసుకుని తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించింది. జస్టిస్ మండవ కిరణ్మయి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.రాష్ట్రంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు భద్రత కోరుతూ వేర్వేరుగా హైకోర్టును ఆశ్రయించారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు సిద్ధమవుతున్న తమకు రక్షణ కల్పించాలని పోలీసులకు వినతిపత్రాలు సమర్పించినా స్పందన లేదని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వి. సాయికుమార్, సానేపల్లి రామలక్ష్మణరెడ్డి, కొమ్మారెడ్డి దివాకర్‌రెడ్డి, వెంకటేష్ తదితరులు కోర్టుకు తెలిపారు.ఇటీవల జరిగిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీ నేతలు దాడులు, దౌర్జన్యాలకు పాల్పడ్డారని పిటిషనర్లు ఆరోపించారు. రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ ఇలాంటి పరిస్థితులు ఎదురయ్యే ప్రమాదం ఉందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో అభ్యర్థుల భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని హైకోర్టు పోలీసులను ఆదేశించింది.

అక్వాన్ తుపానుపై చంద్రబాబు సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలకు ఎప్పటికప్పుడు వాతావరణ హెచ్చరికలు జారీ చేస్తూ అప్రమత్తం చేయాలని సూచించారు.తుపాను గంటకు మూడు కిలోమీటర్ల వేగంతో కదులుతోందని, తీవ్ర తుపానుగా మారే ప్రమాదం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. దీని ప్రభావంతో ఈ నెల 19, 20 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, తీరం దాటే సమయంలో బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని అంచనా వేశారు.స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సిబ్బంది ద్వారా ప్రజలకు నేరుగా సమాచారాన్ని చేరవేయాలని చంద్రబాబు సూచించారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇటీవల కాలంలో రాష్ట్రాన్ని మూడో తుపాను ప్రభావితం చేస్తోందని, విపత్తులొస్తున్నాయని భయపడాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం, అధికారులు అండగా ఉంటారనే భరోసాను ప్రజల్లో కల్పించాలని ఆదేశించారు.తుపాను కారణంగా చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోతే వెంటనే తొలగించి విద్యుత్, రవాణా వ్యవస్థలను పునరుద్ధరించాలని స్పష్టం చేశారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ అవసరమైన చోట సహాయక చర్యలు చేపట్టాలని, బాధితులకు పునరావాసం కల్పించాలని సూచించారు. చెరువులు, కాల్వలకు గండ్లు పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించాలని చంద్రబాబు ఆదేశించారు.

అక్వాన్ తుపానును ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలి

(మొదటి పేజీ తరువాయి)

ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో తాగునీరు, ఆహారం అందుబాటులో ఉంచాలని సూచించారు.

అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు.

పోలింగ్ వేళ ఉద్యోగులకు సెలవు

- **23 పట్టణ స్థానిక సంస్థల్లో నవంబర్ 26న స్థానిక సెలవు..**

గ్రామ పంచాయతీ ఎన్నికల రోజుల్లోనూ వెసులుబాటు



అమరావతి, నవంబర్ 17(నేటి మినిట్ టు మినిట్): ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో 23 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో ఈ నెల 26న స్థానిక సెలవు ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నాలుగు నగరపాలక సంస్థలు, 19 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలకు ఈ సెలవు వర్తించనుంది.ఆయా ప్రాంతాల్లోని ప్రైవేటు సంస్థలు, కంపెనీలు కూడా తమ ఉద్యోగులకు సెలవు కల్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఈ నిర్ణయం తీసుకుంది.మరోవైపు గ్రామ పంచాయతీలకు సాధారణ ఎన్నికల పోలింగ్ 26, 29, డిసెంబర్ 2 తేదీల్లో మూడు విడతలుగా జరగనుంది. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో పోలింగ్ రోజున నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ చట్టం1881 ప్రకారం స్థానిక సెలవు ప్రకటించే అధికారాన్ని జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం కల్పించింది.సెలవు ప్రకటించడం సాధ్యం కాని చోట్ల ఉద్యోగులు ఓటు వేసేందుకు తగిన సమయం కేటాయించాలని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల యాజమాన్యాలకు స్పష్టం చేసింది.

విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

● చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దు



పత్తికొండ నవంబర్ 17(నేటి మినిట్ టు మినిట్): నేటి కాలంలో అభివృద్ధి చెందుతున్న సాంకేతికతను విద్యార్థులు అందిపిచ్చుకొని అభివృద్ధి చెందాలని, చెడు మార్గాల్లో వెళ్లి జీవితాలు పాడు చేసుకోరాదని శాంతి టాలెంట్ హై స్కూల్ వ్యవస్థాపకులు సత్యనారాయణ, ప్యానల్ న్యాయవాదులు సూరజ్ నబి, శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం కర్నూలు జిల్లా పత్తికొండలో జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ, రాష్ట్ర జిల్లా న్యాయసవాధికార సంస్థ ఆదేశాల మేరకు సురక్షిత్ బచ్పన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పేర్లు గర్వించేలా ముందుకు సాగాలన్నారు. అలాగే ఆడపిల్లల పట్ల మర్యాదగా వ్యవహరించి వారిని గౌరవించాలని లేదంటే ఫోక్సో చట్టం కింద శిక్ష అర్హులవుతారని తెలిపారు. మాదకద్రవ్యాల జోలికి వెళ్లకుండా జాగ్రత్త పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం విజయలక్ష్మి ఉపాధ్యాయుడు నాగరాజు, ఇతర ఉపాధ్యాయులు లోకాదాలత్ క్లర్క్ రాఘవేంద్ర విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి.. గ్రామాభివృద్ధి చేసి చూపిస్తా!

- వెలమకూరు సర్పంచ్ అభ్యర్థిగా గొల్ల పార్వతి నామినేషన్



దేవనకొండ నవంబర్ 17(నేటి మినిట్ టు మినిట్): దేవనకొండ మండలం వెలమకూరు గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా గొల్ల పార్వతి నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ ప్రజలు తనపై నమ్మకం ఉంచి సర్పంచ్ అభ్యర్థిగా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.ఒక్కసారి తనకు అవకాశం ఇచ్చి గెలిపిస్తే గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తానన్నారు. గ్రామంలో తాగునీటి సమస్యలు పరిష్కరించడం, పారిశుధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు.గ్రామసభల ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. తన నామినేషన్ కార్యక్రమంలో పాల్గొని మద్దతుగా నిలిచిన వార్డు సభ్యులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, అభిమానులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

అనంతపురం జిల్లాలో ప్రశాంతంగా తొలి విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ

● పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య నామినేషన్ల స్వీకరణ

● అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు భద్రతా చర్యలు

● డ్రోన్ల ద్వారా నామినేషన్ల కేంద్రాలపై పోలీసుల నిఘా





అనంతపురం,నవంబర్ 17(నేటి మినిట్ టు మినిట్): జిల్లాలో తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. జిల్లా ఎస్పీ పి. జగదీష్, ఐపీఎస్ ఆదేశాల మేరకు నామినేషన్ల కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. సమస్యాత్మక ప్రాంతాలు, నామినేషన్ల కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. అభ్యర్థులు, వారి అనుచరులకు ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించారు. కేంద్రాల వద్ద గుంపులు గుమికూడకుండా చర్యలు తీసుకోవడంతో పాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడవద్దని సూచించారు.పోలీస్ బందోబస్తుతో పాటు డ్రోన్లను వినియోగించి పరిస్థితులను పర్యవేక్షించారు. నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు పోలీసులకు సహకరించిన అన్ని వర్గాల ప్రజలకు జిల్లా ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల తదుపరి ప్రక్రియ కూడా ప్రశాంత వాతావరణంలో జరిగేలా పటిష్ట భద్రతా చర్యలు కొనసాగిస్తామని వెల్లడించారు.

కానిస్టేబుల్ కుటుంబానికి తోటి బ్యాచ్ పోలీసుల ఆర్థిక చేయూత

- బాధిత కుటుంబానికి రూ.4.56 లక్షల ఆర్థిక సహాయం చెక్కు అందజేత



కర్నూలు నవంబర్ 17(నేటి మినిట్ టు మినిట్): తమ తోటి బ్యాచ్ కానిస్టేబుల్ అనారోగ్యంతో మృతి చెందితే ఆ కుటుంబానికి కానిస్టేబుల్ బ్యాచ్ మిత్రులు ఆర్థిక సాయం అందించి మానవత చాటుకున్నారు. 2004 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్ సి. రఘు (పీసీ 436) ఎమ్మిగనూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ, 2026 నవంబర్ 5వ తేదీన అనారోగ్యంతో మృతి చెందారు. కానిస్టేబుల్ సి.రఘుకుఇంటర్మీడియట్ చదువుచున్న కుమారుడు సాయిప్రణీత్ , పదో తరగతి చదువుచున్న కుమార్తె తేజస్వినీ ఉన్నారు.కానిస్టేబుల్ సి. రఘు కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలిచేందుకు ఎమ్మిగనూరు రూరల్ పోలీసులు, తోటి కానిస్టేబుళ్లు ముందుకు వచ్చారు. 2004 బ్యాచ్‌కు చెందిన పోలీసులు తమ వంతు సహాయంగా సేకరించిన మొత్తం రూ. 4.56 లక్షల చెక్కు ను మంగళవారం కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలో కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ చేతుల మీదుగా కానిస్టేబుల్ సి. రఘు భార్య హేమలతకు అందజేశారు.తోటి ఉద్యోగి కుటుంబానికి ఆపద సమయంలో అండగా నిలిచి ఆర్థిక సహాయం అందించిన 2004 బ్యాచ్ పోలీసుల ఔదార్యం అభినందనీయమని ఈ సందర్భంగా కర్నూలు ఎస్పీ ప్రశంసించారు. జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు నాగరాజు, 2004 బ్యాచ్ పోలీసులు, కానిస్టేబుల్ రఘు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పంటల బీమాను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

రబీ 202627 సీజన్‌కు డిసెంబర్ 15 చివరి గడువు.. పంటల వారీగా ప్రీమియం, బీమా వివరాలు వెల్లడించిన కలెక్టర్ ఏ. సిరి



కర్నూలు నవంబర్ 17(నేటి మినిట్ టు మినిట్): 2026-27 సీజన్‌లో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద రైతులు తమ పంటలకు బీమా చేయించుకుని పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పంటల బీమా పథకం పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగినప్పుడు రైతులకు ఆర్థిక భరోసా కల్పించడమే పంటల బీమా పథకం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. రైతులు నిర్ణీత ప్రీమియం మొత్తాన్ని డిసెంబర్ 15, 2026లోగా చెల్లించి తమ పంటలకు బీమా రక్షణ పొందాలని సూచించారు. **ఎకరాకు పంటల వారీగా ప్రీమియం, బీమా వివరాలు:** – శనగలు: రూ. 420 ప్రీమియం రూ. 28,000 బీమా. – వరి: రూ. 630 ప్రీమియం రూ. 42,000 బీమా. – జొన్నలు: రూ. 297 ప్రీమియం రూ. 19,800 బీమా. – వేరుశనగ: రూ. 480 ప్రీమియం రూ. 32,000 బీమా. – ఉల్లి: రూ. 1,350 ప్రీమియం రూ. 45,000 బీమా.అర్హులైన రైతులందరికీ పంటల బీమాపై విస్తృతంగా అవగాహన కల్పించి, నిర్ణీత గడువులోగా నమోదు ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, ఇతర శాఖల అధికారులు, బీమా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్ బకాయిల వసూళ్లలో కమిషనర్ నిర్లక్ష్యం సహించం

- టిడిపి మాజీ ఇంచార్జ్ డాక్టర్ జి వీర ప్రవీణ్ కుమార్ రెడ్డి



ప్రొద్దుటూరు,నవంబర్ 17(నేటి మినిట్ టు మినిట్): ఎగ్జిబిషన్ నిర్వహణ బకాయిల వసూలు వ్యవహారంలో మున్సిపల్ కమిషనర్ వ్యవహారశైలి కూటమి ప్రభుత్వానికి, మున్సిపాలిటీకి చెడ్డపేరు తెచ్చేలా ఉందని టీడీపీ మాజీ ఇంచార్జ్ జీవీ ప్రవీణ్ కుమార్ రెడ్డి విమర్శించారు. మంగళవారం ఉదయం స్థానిక వైఎంఆర్ కాలనీలోని తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎగ్జిబిషన్ బకాయిలు వసూలు చేయకుండా నిర్వాహకులతో లోపాయికారీ ఒప్పందాలకు ప్రయత్నించడం సరికాదన్నారు. గెజిట్ నిబంధనలకు విరుద్ధంగా రూ.100 బాండ్ పేపర్‌పై అఫిడవిట్లు తీసుకోవడానికి చట్టబద్ధత ఏమిటని ప్రశ్నించారు. గతంలో విడతల వారీగా చెల్లింపులకు అవకాశం లేదని చెప్పిన కమిషనర్ ఇప్పుడు స్వయంగా గడువు ఎలా ఇస్తారని నిలదీశారు. ఈ వ్యవహారంలో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు కుటుంబంతో కమిషనర్‌కు ఏమైనా అవగాహన కుదిరిందా అని ప్రశ్నించారు. గతంలో ఎగ్జిబిషన్‌పై ఆందోళనలు చేసిన రాచమల్లు ప్రస్తుతం ఎందుకు మౌనంగా ఉన్నారని వ్యాఖ్యానించారు. ఎగ్జిబిషన్ సామగ్రి విలువ రూ.90 లక్షలు మాత్రమే ఉంటే, దానిని రూ.3 కోట్లుగా చూపాలని కమిషనర్ లేఖ రాయడంలో ఆంతర్యమే మిటని ప్రశ్నించారు. పాన్ కార్డు లేని వ్యక్తికి టెండర్ ఎలా కేటాయించారని నిలదీస్తూ, ఈ వ్యవహారంపై అవినీతి నిరోధక శాఖ, ఆదాయపు పన్ను శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. నూతన మున్సి పల్ చైర్మన్ నంద్యాల రాఘవరెడ్డి చొరవ తీసుకుని మున్సిపాలిటీకి రావాల్సిన బకాయిలను వసూలు చేయించాలని కోరారు. బకాయిలను తక్షణమే వసూలు చేయకపోతే పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించా రు. ఎగ్జిబిషన్ ప్రాంగణం నుంచి ఒక్క వస్తువు బయ టకు వెళ్లినా అందుకు కమిషనరే బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. అవసరమైతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి కమిషనర్ ఆస్తుల జప్తునకు చర్యలు తీసుకునేలా చూస్తామని హెచ్చరిం చారు. మీడియాపై వాట్సాప్‌లో దుష్ప్రచారం చేస్తే తగిన సమాధానం ఇస్తానని జీవీ ప్రవీణ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

మున్సిపల్ ఎగ్జిబిషన్ బకాయిలను వసూలు చేయాలి

- మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి



ప్రొద్దుటూరు,నవంబర్ 17(నేటి మినిట్ టు మినిట్): ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో ఎగ్జిబిషన్ నిర్వహణకు సంబంధించి భారీగా అవినీతి జరిగిందని తక్షణమే విచారణ జరిపి మున్సిపాలిటీకి రావాల్సిన సొమ్మును వసూలు చేయాలని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఆర్ట్స్ కళాశాల రోడ్డులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎగ్జిబిషన్ వేలంలో రూ.2.15 కోట్లకు దక్కించుకున్న నిర్వాహకులు ఇంకా రూ.1.65 లక్షలు చెల్లించాల్సి ఉన్నప్పటికీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి స్పందించడం లేదని విమర్శించారు. గెజిట్ నిబంధనల ప్రకారం వేలంలో అధిక పాట పాడిన వ్యక్తి ఐదు రోజుల్లోపు పూర్తి మొత్తాన్ని చెల్లించిన తర్వాతే ఎగ్జిబిషన్ ప్రారంభించాల్సి ఉంటుందని, అయితే నిబంధనలకు విరుద్ధంగా మున్సిపల్ కమిషనర్ అనుమతులు జారీ చేశారని ఆరోపించారు. నిర్వాహకుల నుంచి గెజిట్‌కు విరుద్ధంగా అఫిడవిట్ ఎలా స్వీకరించారని, కలెక్టర్ లేదా మున్సిపల్ ప్రత్యేక అధికారి అయిన జాయింట్ కలెక్టర్ ఈ వ్యవహారంలో ఏ విధంగా సహకరించారని ప్రశ్నించారు. అఫిడవిట్ ప్రకారం నిర్వాహకులు నగదు చెల్లించారా లేదా అన్నది అధికారులు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఒక్క రూపాయి అదనంగా స్టాంపు విక్రయించినా సహించబోమని గతంలో ప్రమాణం చేయించిన ఎమ్మెల్యే, ప్రస్తుతం మున్సిపాలిటీకి రావాల్సిన ఎగ్జిబిషన్ బకాయిల విషయంలో ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు ఎగ్జిబిషన్లకు సంబంధించిన సొమ్ము చెల్లించకుండా నిర్వాహకులు బకాయిలు పెట్టారని ఆరోపించారు. మున్సిపల్ కమిషనర్ ఎగ్జిబిషన్ ప్రాంతానికి వెళ్లడం కేవలం ప్రచార చిత్రాల కోసమేనని విమర్శించారు. మున్సిపాలిటీకి రావాల్సిన రూ.1.63 కోట్ల ఎగ్జిబిషన్ ఆదాయం, మున్సిపల్ స్థలాల వ్యవహారంపై ప్రజలు ప్రశ్నించినా స్పందన లేకపోవడంతో కొందరు న్యాయ స్థానాన్ని ఆశ్రయించారని తెలిపారు. ఎగ్జిబిషన్ సామగ్రిని సీజ్ చేసినట్లు కమిషనర్ లేఖ ఇచ్చి, నిర్వాహకులు కోర్టును ఆశ్రయించేలా వ్యవహరించేందుకు ప్రణాళిక రూపొందించారనే అనుమానం వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, మున్సిపాలిటీకి రావాల్సిన బకాయిలను తక్షణమే వసూలు చేయాలని డిమాండ్ చేశారు. ఎగ్జిబిషన్ బకాయిల వ్యవహారంలో ఎమ్మెల్యే ప్రమేయం లేదని నిరూపించుకోవాలంటే నిర్వాహకుల నుంచి పూర్తి సొమ్ము వసూలు చేయించాలని పాతకోట బంగారు మునిరెడ్డి సవాల్ విసిరారు.

పారా క్రీడల్లో మెరిసిన ఎస్వీఆర్ ఇంజనీరింగ్

కళాశాల విద్యార్థి భరత్ కుమార్!

● స్టేట్ మీట్‌కు ఎంపికై కళాశాలకు ఎస్ వి ఆర్ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి భరత్ కుమార్



నంద్యాల నవంబర్ 17(నేటి మినిట్ టు మినిట్): ఎస్వీఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి భరత్ కుమార్ పారా క్రీడల్లో ప్రతిభ కనబరిచి స్టేట్ మీట్‌కు ఎంపిక కావడం కళాశాలకు గర్వకారణంగా నిలిచింది. ఫెన్సింగ్ విభాగంలో ప్రతిభను చాటుకున్న భరత్ కుమార్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో కళాశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ వెంకటరామిరెడ్డి డైరెక్టర్, మల్లికార్జునరెడ్డి ప్రిన్సిపాల్ ,హరిప్రసాద్ రెడ్డి మరియు విద్యార్థి భరత్ కుమార్ ను ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ దినేష్ రెడ్డి మాట్లాడుతూ, తమ కళాశాల విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల్లో కూడా ఎల్లప్పుడూ ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. ప్రతి విద్యార్థి క్రీడల్లో రాణించి, ఉన్నత స్థాయికి చేరుకోవాలని, తద్వారా కళాశాలకు, తల్లిదండ్రులకు, తమ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కళాశాల యాజమాన్యం ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఐ హెచ్ ఓ డి సుబ్బారెడ్డి ఫిజికల్ డైరెక్టర్ విల్సన్ కుమార్ పాల్గొని భరత్ కుమార్ ను అభినందించారు.

నంద్యాలలో విష సంస్కృతికి పోవాలి

మంచి రోజులు వస్తాయి ప్రజల ఆశీర్వాదంతో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నాం

మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, మహిళా బ్యాంక్ చైర్పర్సన్ నాగిని రవి సింగారెడ్డి...





నంద్యాల నవంబర్ 17(నేటి మినిట్ టు మినిట్): నంద్యాల గడ్డపై కొత్త విష సంస్కృతి అంతం కావాలని, తిరిగి మంచి రోజులు వస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ప్రజల ఆశీర్వాదంతో శిల్పా కుటుంబం ఎప్పుడూ ప్రజల వెంటే ఉంటూ విస్తృతంగా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. స్థానిక శిల్పా సేవాసమితి కార్యాలయంలో శిల్పా మహిళా సహకార్ బ్యాంక్ ద్వారా లబ్ధిదారులైన 121 మంది మహిళలకు మొత్తం 21లక్షల77 వేల రూపాయల విలువైన ఆర్థిక సహాయం (చెక్కులను) పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిరెడ్డి, బ్యాంక్ చైర్పర్సన్ నాగిని రవిసింగారెడ్డి హాజరయ్యారు. వీరితో పాటు మహిళా బ్యాంక్ డైరెక్టర్ పూర్ణిమ, మేనేజర్ హరిలీల, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి మరియు నాగిని రవిసింగారెడ్డి మాట్లాడుతూ... గత రెండు దశాబ్దాలుగా శిల్పా కుటుంబం నంద్యాల ప్రజలకు ఎలాంటి ఆశలు ఆశించకుండా నిస్వార్థంగా సేవలు అందిస్తోందని గుర్తుచేశారు. అయితే, తాము చేస్తున్న మంచిని ఓర్వలేక, అభివృద్ధిని అడ్డుకోవడమే పనిగా పెట్టుకున్న కొందరు వ్యక్తులు తమ 'శిల్పా సహకార్ సూపర్ మార్కెట్' సేవలను అడ్డుకున్నారని మండిపడ్డారు. ఖాళీ చేయించిన ఆ స్థానంలో కేవలం ఆరు నెలల పాటు ఒక్క షాప్‌ను మాత్రమే నిర్వహించడం గమనార్హమని, ఇది తమపై ఉన్న రాజకీయ కక్ష కాదా? అని ప్రశ్నించారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో శిల్పా కుటుంబం చేస్తున్న సేవా కార్యక్రమాలను అడ్డుకున్న వారికి ప్రజలు తగిన తీర్పునిచ్చి బుద్ధి చెప్పారన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలు ఎప్పుడూ మంచి చేసేవారికే పట్టం కడతారని స్పష్టం చేశారు. రాష్ట్రంలో శిల్పా కుటుంబానికి ఒక ప్రత్యేక గుర్తింపు వచ్చిందంటే అది కేవలం నంద్యాల ప్రజల దీవెనలు, ఆశీర్వాదాల వలనేనని తెలిపారు. ఈ సంక్షేమ ప్రయాణంలో భాగంగానే శిల్పా మహిళా సహకార్ బ్యాంకును పునఃప్రారంభించి, మహిళలకు రుణాలను అందిస్తున్నామని వెల్లడించారు. బ్యాంక్ ద్వారా రుణాలు పొందిన ప్రతి మహిళా ఆర్థికంగా ఎదగాలని, కుటుంబానికి అండగా నిలవాలని ఆకాంక్షించారు. నంద్యాల ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలను అందించేందుకు శిల్పా కుటుంబం మరింత ఉత్సాహంగా ముందుకెళ్తుందని స్పష్టం చేశారు.

సాగునీటి సమస్యల పరిష్కారంపై మంత్రి ఎన్ఎండి ఫరూక్‌ను కలిసిన చాపిరేవుల, పాండురంగాపురం రైతులు



నంద్యాల నవంబర్ 17(నేటి మినిట్ టు మినిట్): నంద్యాల పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ శాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ను చాపిరేవుల మరియు పాండురంగాపురం, సుబ్బారెడ్డి పాలెం, కానాల, పుసులూరు , మిట్నాల గ్రామాలకు చెందిన రైతులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ గ్రామాల పరిధిలోని పంట పొలాలకు సాగునీటి అవసరాల గురించి రైతులు మంత్రి ఫరూక్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రస్తుత సాగు పరిస్థితులు, నీటి సరఫరాలో ఎదురవుతున్న ఇబ్బందులపై మంత్రి ఫరూక్ రైతులతో సుదీర్ఘంగా చర్చించారు. రైతుల సమస్యలను ఓపికగా ఆలకించిన మంత్రి ఎన్ఎండి ఫరూక్ , పంటలకు సకాలంలో సాగునీరు అందేలా సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతు పక్షపాతిగా ఉండి, అన్నదాతల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తుందని ఆయన భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో చాపిరేవుల, పాండురంగాపురం, సుబ్బారెడ్డి పాలెం, కానాల, పుసులూరు , మిట్నాల గ్రామాల రైతు నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జల సంరక్షణ, భూగర్భ జలాల పెంపునకు

సమగ్ర కార్యాచరణ చేపట్టాం

చెరువుల అనుసంధానం (క్యాస్కేడ్ విధానం) ద్వారా నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాం

మురుగునీరు నదుల్లో కలవకుండా ఎస్టీపీ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి: జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



నంద్యాల,నవంబర్ 17(నేటి మినిట్ టు మినిట్): జిల్లాలో జల వనరుల సంరక్షణ, భూగర్భ జల మట్టాల పెంపు, చెరువుల పునరుద్ధరణ, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంపొందించేందుకు సమగ్ర కార్యాచరణ చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి కేంద్ర బృంద సభ్యులకు వివరించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో కేంద్ర బృంద సభ్యులైన కేంద్ర జల సంఘం (జఔజ) జల సంచయ్ – జల భాగీదారీ విభాగానికి చెందిన ఈఈ రామప్రసాద్, ఎస్‌డీఈ నాగార్జునతో పాటు సంబంధిత జిల్లాఅధికారులుపాల్గొన్నారు.లిఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని డోన్, ప్యాపిలి, బేతంచర్ల, బనగానపల్లి, కొలిమిగుండ్ల తదితర ప్రాంతాలు పూర్తిగా రాతిమయంగా ఉండి తక్కువ నీటి ఇంకుడు సామర్థ్యం, కాలువల సదుపాయం లేకపోవడం వల్ల భూగర్భ జలాల పెంపు సవాలుగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో వర్షపు నీటిని సమర్థవంతంగా ఒడిసిపట్టి, భూగర్భ జలాలను పెంపొందించేలా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. జిల్లాలోని చెరువులను అనుసంధానిస్తూ క్యాస్కేడ్ విధానంలో అభివృద్ధి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగా 27 క్యాస్కేడ్ల పరిధిలోని 86 చెరువుల ద్వారా నీటి నిల్వ, ప్రవాహ వ్యవస్థను మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఫీడర్ ఛానళ్లను గుర్తించి పునరుద్ధరించడం, వాటి జియో లొకేషన్లను నమోదు చేయడం ద్వారా పనుల పర్యవేక్షణను మరింత పారదర్శకంగా, సులభతరంగా మార్చినట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది ఫీడర్ ఛానళ్ల అభివృద్ధికి సంబంధించి 2,151 పనులు చేపట్టినట్లు కలెక్టర్ వివరించారు.లిఅలాగే పట్టణ ప్రాంతాల నుంచి వెలువడే మురుగునీరు నదుల్లో కలవకుండా శుద్ధి చేసేలా మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కుందూ నది పరిరక్షణతో పాటు రైతులకు సాగునీటి వనరులు కలుషితం కాకుండా చూడటం ముఖ్యమన్నారు. జిల్లాలో నీటి వనరుల అభివృద్ధి, చెరువుల అనుసంధానం, భూగర్భ జలాల పెంపు, నీటి సమర్థ వినియోగం వంటి అంశాల్లో చేపట్టిన కార్యక్రమాలను జాతీయ జల అవార్డుల మార్గదర్శకాలకు అనుగుణంగా సమగ్ర ఆధారాలతో సిద్ధం చేసి చూపించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాలలో స్పాట్ మరియు మేనేజ్‌మెంట్ కోటా ప్రవేశాలు ప్రారంభం



నంద్యాల నవంబర్ 17(నేటి మినిట్ టు మినిట్): 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి), నంద్యాలలో స్పాట్ అడ్మిషన్లు మరియు మేనేజ్‌మెంట్ కోటా ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైనట్లు కళాశాల చైర్మన్ డా. జి. రామకృష్ణ రెడ్డి తెలిపారు.ప్రభుత్వం నిర్వహించిన ఆన్‌లైన్ డిగ్రీ అడ్మిషన్ల మూడు దశల్లో సీట్లు పొందని అర్హులైన విద్యార్థుల నుంచి స్పాట్ మరియు మేనేజ్‌మెంట్ కోటా ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన వెల్లడించారు కళాశాలలో అందుబాటులో ఉన్న బి.ఎస్సీ. కంప్యూటర్ సైన్స్, బి ఎస్సీ. బోటనీ, బి.కామ్. కంప్యూటర్ అప్లికేషన్స్, బి.బి. ఐ మరియు బి.సి.ఏ కోర్సులలో ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా లిచైర్మన్ డా. జి. రామకృష్ణ రెడ్డి లి మాట్లాడుతూ, ఆసక్తి కలిగిన అర్హులైన విద్యార్థులు కళాశాలను నేరుగా సంప్రదించి ప్రవేశాలకు సంబంధించిన వివరాలు తెలుసుకొని దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే, స్పాట్ మరియు మేనేజ్‌మెంట్ కోటా ద్వారా ప్రవేశం పొందిన విద్యార్థులకు ప్రభుత్వం అందించే స్కాలర్‌షిప్‌లు వర్తించవని స్పష్టం చేశారు. కాబట్టి విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించి ప్రవేశాలు పొందాలని తెలిపారు.కళాశాల చైర్మన్ డా. జి. రామకృష్ణ రెడ్డి , కళాశాల డైరెక్టర్ డాక్టర్ జి హేమంత్ రెడ్డి ప్రిన్సిపాల్ కె.బి.వి. సుబ్బయ్య పాల్గొన్నారు.ప్రిన్సిపాల్,శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి),శ్రీనివాస నగర్, నంద్యాల.సెల్ నంబర్లు:99852 40952,77991 56956,87907 87273

డిసెంబర్‌లో నిర్వహించనున్న మూడు జిల్లాల భారీ దావత్-ఎ-తబ్లీగ్ ఇజ్తిమా ఏర్పాట్లపై మంత్రి ఎన్ఎండి ఫరూక్‌తో ముఖ్య సమావేశం



నంద్యాల నవంబర్ 17(నేటి మినిట్ టు మినిట్): రానున్న డిసెంబర్ నెలలో 17 , 18 వ తేదీలలో నంద్యాలలో నిర్వహించనున్న కర్నూలు, కడప మరియు నంద్యాల మూడు జిల్లాల ఉమ్మడి భారీ దావత్-ఎ-తబ్లీగ్ ఇజ్తిమా ఏర్పాట్లకు సంబంధించి దావత్-ఎ-తబ్లీగ్ బాధ్యుల ప్రతినిధి బృందం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు జనాబ్ ఎన్ఎండి ఫరూక్ ని కలిసి వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా ఇజ్తిమా నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాల గురించి ప్రతినిధి బృందం మంత్రి ఫరూక్ దృష్టికి తీసుకువచ్చింది. ముఖ్యంగా తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, రహదారులు మరియు ఇతర అవసరమైన సౌకర్యాలను ప్రభుత్వం తరఫున కల్పించాలని విజ్ఞప్తి చేసింది. ఈ భారీ దైవిక సమావేశానికి సుమారు రెండు లక్షల మంది పాల్గొనే అవకాశం ఉందని బాధ్యులు తెలియజేశారు. ఇంత పెద్ద సంఖ్యలో పాల్గొనే వారి సౌకర్యార్థం ప్రభుత్వం మరియు సంబంధిత శాఖలు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని కోరారు. ప్రతినిధి బృందం విజ్ఞప్తులను మంత్రి జనాబ్ ఎన్ఎండి ఫరూక్ సానుకూలంగా పరిశీలించి, ఇజ్తిమాకు అవసరమైన సదుపాయాలను వీలైనంత త్వరగా కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ సమావేశంలో నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ మరియు దావత్-ఎ-తబ్లీగ్ తరఫున ముఫ్తీ ముహమ్మద్ రఫీ సాహెబ్, జనాబ్ అబ్దుస్సలాం సాహెబ్, జనాబ్ ఫయాజ్ సాహెబ్, జనాబ్ హిదాయత్ ఖాన్ (ఆర్.కే.) తదితరులు ప్రతినిధులుగా పాల్గొన్నారు. వీరితో పాటు జమాత్‌కు చెందిన పలువురు ముఖ్య బాధ్యులు కూడా హాజరయ్యారు. చివరగా ఇజ్తిమా ఇమాముల సంఘం అధ్యక్షులు అంజద్ భాషభాష సిద్ధికి మాట్లాడుతూ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ఆత్మకూరు ఇస్తే మాకు మరియు కడప ఇస్తే మాకు అన్ని విధాలుగా ప్రభుత్వం నుంచి నిధులు తెచ్చి ఇస్తామని విజయవంతంగా చేశారని గుర్తు చేశారు దేశంలో శాంతి సామరస్యాలు నెలకొనాలని ప్రార్థనలతో సమావేశం ముగిసింది.

M/S SUNIL PUBLICATIONSPrinting Press (Name & Address)PrinterM/S SUNIL PUBLICATIONS D.NO.: 28-5-782, HOUSING BOARD COLONY, REVENUE WARD NO. 28, ANANTAPUR., ANDHRA PRADESH - 515001.